

రైట్ రైట్.. ఫ్రీ సర్వీస్

నేటి నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

డిపోల పరిధిలో ప్రారంభ వేడుకలకు ఏర్పాట్లు

మహిళలకు అందుబాటులో 195 బస్సులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఏడాదిన్నర నుంచి ఎంతగానో ఎదురుచూస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం శ్రావణ శుక్రవారం సాయంత్రం నుంచి అమలులోకి రానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీల్లో ప్రకటించిన సూపర్-6 పథకాల్లో ఒకటైన స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆర్భాటంగా ప్రారంభించడానికి ఆర్టీసీ అధికారులు సన్నాహాలు పూర్తిచేశారు. అమరావతిలో సీఎం ప్రారంభించిన తరువాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అమలాపురం, రావులపాలెం, రాజోలు, రామచంద్రపురం ఆర్టీసీ బస్సు డిపోల పరిధిలో ఎంపిక చేసిన బస్సులను మహిళల ఉచిత ప్రయాణాలకు రోడ్డెక్కనున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీతో సహా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెందిన నాయకుల సమక్షంలో స్త్రీశక్తి పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించడానికి సన్నద్ధమయ్యారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 195 బస్సుల ద్వారా వర్తింపజేసేందుకు ప్రజా రవాణాశాఖ సర్వం సిద్ధమయ్యారు. మహిళా ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు సర్వీసులను నడిపేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధంచేశారు. ముఖ్యంగా సిబ్బందికి ఫ్రీ టిక్కెట్టు విధానంపై శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే పూర్తిచేశారు. ఫ్రీ టిక్కెట్ ఇచ్చే కండక్టర్లకు పూర్తి అవగాహనను కల్పించి మహిళల ఉచిత రవాణా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పూర్తిచేసినట్టు ఆర్టీసీ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్టీపీ రాఘవకుమార్ వెల్లడించారు. జిల్లాలో మహిళల ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాల కోసం అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సు సర్వీసులను మాత్రమే నడుపుతున్నారు. వీటిలో అమలాపురం డిపో నుంచి 64, రామచంద్రపురం నుంచి 49, రావులపాలెం నుంచి 49, రాజోలు డిపో నుంచి 33 ఎంపిక చేసిన బస్సులు మహిళల ఉచిత రవాణా కోసం సిద్ధం చేసినట్టు రాఘవకుమార్ వెల్లడించారు. స్వాతంత్ర్య సంబరాల వేళ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా వారిని ఆనంద పరవశింపజేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలవంతం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

చెరువులైన చేలు!



రావులపాలెం మండలం ఈతకోట సమీపంలో ముంపు నీటిలో చిక్కుకున్న పంట పొలాలు

- భారీ వర్షంతో నీట మునిగిన పంటపొలాలు
- జిల్లాలో అత్యధికంగా అంబాజీపేటలో 16.78 సెంటీమీటర్ల వర్షపాతం
- అత్యల్పంగా మండపేట, మలికిపురంలలో 25.6 మిల్లీమీటర్లు





పి.గన్నవరం మండలం పోతవరం ముగ్గుబట్టీల వద్ద నీట మునిగిన వరిచేలు.. (పైన) ముంగండలో నీటమునిగిన నారు కట్టలు

అమలాపురం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో పంట భూములు వందల ఎకరాల్లో ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ప్రవాహాన్ని తలదన్నే రీతిలో వరిచేలన్నీ ముంపునకు గురయ్యాయి. సమీపంలో ఉన్న ప్రధాన డ్రెయిన్లు, పంటకాల్వలు పొంగి ప్రవహించడంతోపాటు ముంపునీరు దిగే మార్గం లేకపోవడం, తూడు, గుర్రపుడెక్క వంటివి డ్రెయిన్లలో పెరిగిపోవడం వంటి పరిస్థితుల్లో ముంపు తీవ్రత పెరిగి రైతులు నష్టపోతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల ఎకరాలకు పైగానే పంట పొలాలు ముంపు బారిన పడినట్టు అధికారులు భావిస్తున్నారు. రావులపాలెం, పి.గన్నవరం, అంబాజీపేట, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం అమలాపురం రూరల్ మండలాల పరిధిలో ఉన్న ఖరీఫ్ సేద్యం చేస్తున్న పంట పొలాలు నీరు నిలిచిపోవడం వల్ల పొలాలు ముంపునకు గురయ్యాయి. నీటిని మళ్లించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన రికార్డుస్థాయి వర్షపాతంతో పంటచేలు ముంపునకు గురైనట్టు అధికారులు చెబుతున్నారు. అత్యధిక వర్షపాతం నమోదైన ముమ్మిడివరంలో ముంపునకు గురైన తహశీల్దార్, పోలీసుస్టేషన్, ట్రెజరీతో సహా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలను జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డుల భద్రతలకు అధికారులు తీసుకోవాల్సిన సత్వర చర్యలు, శాశ్వత నిర్మాణాలపై సూచనలు చేశారు.

జిల్లాలో రికార్డుస్థాయి వర్షపాతం..

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు నమోదైన రికార్డుస్థాయి వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా 16.78 సెంటీమీటర్ల వర్షపాతం అంబాజీపేట మండలంలో నమోదైంది. అత్యల్పంగా 25.6 మిల్లీమీటర్ల వర్షపాతం మండపేట, మలికిపురం మండలాల్లో నమోదైంది. ఇక మండలాల వారీగా ఆత్రేయపురంలో 78.8, రాయవరం 44.8, రామచంద్రపురం 72.2, ఆలమూరు 92.6, రావులపాలెం 113.8, కొత్తపేట 83.2, కపిలేశ్వరపురం 81.2, కె.గంగవరం 85.4, ఐ.పోలవరం 114.2, అయినవిల్లి మండలంలో 78.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పి.గన్నవరంలో 48.4, మామిడికుదురులో 13.2, రాజోలులో 27.8, సఖినేటిపల్లి 36.4, అల్లవరం 132, అమలాపురం 133.2, ఉప్పలగుప్తం 92.4, కాట్రేనికోనలో 68.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 90.8 మిల్లీమీటర్ల వర్షపాతం సగటున నమోదైంది.

47 గ్రామాల్లో పంట నష్టం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి ఏడు మండలాల పరిధిలో 49 గ్రామాలు ప్రభావితమైనట్టు జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. జిల్లాలో 1350 మంది రైతులకు సంబంధించి 18 నర్సరీలు, 1080 ఎకరాల్లో ప్యాడీ (వరిచేలు) దెబ్బతిన్నట్టు ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైన దృష్ట్యా ప్రభుత్వం ప్రాథమికంగా అందించిన నివేదిక ఆధారంగా ఈ పంట నష్టాలను ప్రభుత్వం ప్రకటించింది.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్





ముమ్మిడివరంలో తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

ముమ్మిడివరం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పల్లపు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి ముమ్మిడివరంలోని ప్రభుత్వ కార్యాలయాలు ముంపు బారిన పడ్డాయి. ఆయా ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ మహేష్‌కుమార్ గురువారం ఇన్‌చార్జి ఆర్డీవో కె.మాధవితో కలిసి పరిశీలించారు. ముమ్మిడివరంలోని తహశీల్దార్ కార్యాలయం, ఉపఖజానా, వ్యవసాయశాఖ, పోలీసుస్టేషన్ కార్యాలయాలు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో భారీవర్షం కురిసినప్పుడు వాటి ఆవరణంతా నీటమునిగి కార్యాలయాల్లోకి నీరు ప్రవేశిస్తోంది. ఆయా కార్యాలయాలను కలెక్టర్ మహేష్‌కుమార్ సందర్శించి రికార్డు రూములు, కంప్యూటర్ల భద్రతను ఆయన పరిశీలించారు. వర్షాలకు ఏమైనా రికార్డులు తడిచాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏవీ తడవకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలను శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు అవసరమైన నివేదికలు రూపొందించాలని ఇన్‌చార్జి ఆర్డీవో మాధవిని ఆదేశించారు. తహశీల్దార్ టి.సుభాష్, సర్కిల్ ఇనస్పెక్టర్ ఎం.మోహన్‌కుమార్ వెంట ఉన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్‌ను ఆదేశించిన సీఎం



సీఎం వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాలు, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా భూగర్భ జలాల పెంపుదలకు కృషిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం అమరావతి నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో సూచించారు. నీటి సంరక్షణ చర్యలతోపాటు ఇటీవల కురుస్తున్న వర్షపు నీటిని అంచెలంచెలుగా చెరువుల్లో నింపడం, భూగర్భజలాల స్థితిగతులపై సమీక్షించడం చేపట్టాలని, అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా ఫారం పాండ్స్, చెరువుల్లో పూడిక తీలు, ఇంకుడుగుంతలు తవ్వే కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడికలుతీసి చిట్టచివరి ఆయకట్టు భూముల వరకు సాగునీరు సరఫరా చేయాలని, రైతులకు నీటిసంఘాలు భరోసాగా నిలబడాలని సూచించారు. తుంపర సేద్యం, సూక్ష్మసేద్యంతో పాటు సరైన పంటల ఎంపిక ద్వారా తక్కువ నీరు అవసరమయ్యే పంటలను, నేల స్వభావానికి అనుగుణంగా పండే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. పర్యావరణానికి, భూగర్భ జలాల సంరక్షణకు మార్గం సుగమం చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్రంలో మొదటి పది సూత్రాల్లో తాగు, సాగునీటి సంరక్షణే ముఖ్యమైనదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన వీడియో కాన్ఫరెన్సులో సీఎం చేసిన సూచనను నమోదు చేసుకున్న కలెక్టర్ జిల్లా అధికారులకు వీడియో కాన్ఫరెన్సు అనంతరం నీటి సంరక్షణ వినియోగంపై సూచనలిచ్చారు. జేసీ టి.నిషాంతి, సాగునీటి వినియోగదారుల జిల్లా అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, డిస్ట్రిబ్యూటరీ సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు ఆహ్వానం

అమలాపురం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పర్యాటక దినోత్సవం-2025ను పురస్కరించుకుని రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్ట అవార్డుల ప్రదానం త్వరలో చేపట్టనుందని జిల్లా పర్యాటకశాఖ అధికారి బి.అన్వర్ హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఏపీ పర్యాటక అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా వార్షిక పర్యాటక విశిష్ట అవార్డులకోసం పర్యాటక రంగాల్లోని వివిధ విభాగాల్లో వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఎంపికైనవారు ఏపీ రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్ట అవార్డులు 2024-25 కోసం నామినేట్ చేపడతారని, సెప్టెంబరు 1వ తేదీ సాయంత్రం 6గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 9121725757 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.





వేడుకల కోసం సిద్ధమైన స్త్రీశక్తి శకటం.. మూడు రంగుల హంగులతో అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముస్తాబు



త్రీ..రంగదే!

స్వాతంత్ర్య దినోత్సవ వేళ మూడు మార్పులు

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- బాలికలు,మహిళలు,ట్రాన్స్‌జెండర్లకు ఆధార్‌తో ఫ్రీ
- హైవే ప్రయాణానికి ఫాస్టాగ్ వార్షిక పాస్
- రూ.3 వేలు చెల్లిస్తే 200 సార్లు ఛాన్స్
- రాజ్‌మార్గ్‌యాత్ర యాప్ ద్వారా పాస్‌లు
- రైతులకు కొత్త పాస్‌బుక్‌లు నేటి నుంచే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి మూడు రకాల కీలక నిర్ణయాలు అమల్లోకి రానున్నాయి. వీటి ద్వారా ఇకపై పలు వర్గాలకు స్వేచ్ఛ లభించనుంది. ముఖ్యంగా మహిళలు,యువతులు, హైవేలపై ప్రయాణించే వాహనదారులు, అన్నదాతలు లబ్ధిపొందనున్నారు. నేటి నుంచి అమల్లోకి రానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,హైవే టోల్‌గేట్ల దోపిడీ నుంచి బయటపడేలా కొత్త ఫాస్టాగ్ వార్షిక పాస్, కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీయే. ఈ మూడు కీలక నిర్ణయాల అమలుతో ఆయా వర్గాల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

నేటి నుంచి ఫ్రీ..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేటి సాయంత్రం నుంచి అందుబాటులోకి రానుంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బాలికలు, మహిళలు,ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది. కేవలం ఆధార్‌కార్డు చూపించి రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించొచ్చు. ఈ మేరకు ఈపథకాన్ని సీఎం చంద్రబాబు నేటి సాయంత్రం ప్రారంభించనున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచేసి పేదల నడ్డి విరగ్గొట్టింది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు టీడీపీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించి నేటి నుంచి అమలు చేస్తోంది.ఉమ్మడి జిల్లాలో దాదాపు 38 లక్షల మందికిపైగా మహిళలు లబ్ధిపొందనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో 532 పల్లెవెలుగు, అల్ట్రాపల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు 191, కోనసీమలో 176 పల్లెవెలుగు, తూర్పుగోదావరిలో పల్లెవెలుగు,అల్ట్రాపల్లెవెలుగు,ఇతర బస్సులు 283 ఉన్నాయి.ఎక్స్‌ప్రెస్ బస్సులు వంద వరకు ఉన్నాయి. వీటన్నింటిలోను మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకానుంది.

హైవేపై హాయిగా...

కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వార్షిక ఫాస్టాగ్ పాస్ అమల్లోకి రానుంది. తద్వారా కేవలం రూ.3 వేల ఫాస్టాగ్ తీసుకుని దేశంలో ఏ హైవేపై ఉన్న టోల్‌ప్లాజా ద్వారా ఫ్రీగా ప్రయాణించవచ్చు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి అమల్లోకి వచ్చింది.ఈ పాస్ ద్వారా ప్రయాణించే వెసులుబాటు కార్లు, వ్యాన్‌లు, జీపులు ఇతర వ్యక్తిగత అవసరాలకు వినియోగించే వాటికే వర్తిస్తుంది. ఈ విధానం వల్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వాహనదారులకు భారీగా ప్రయోజనం కలిగించనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు టోల్‌ప్లాజాలు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్నాయి.ఆయా టోల్‌గేట్లు వద్ద నిర్ణీత రుసుంను ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. వీటితో పాటు తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద మరో టోల్ ప్లాజా ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉంది. ప్రస్తుతం ఈ టోల్‌ప్లాజాల ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. ఒక వేళ ఫాస్టాగ్ సొమ్ములు లేకున్నా..ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుము కంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. కొత్త విధానంలో ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించే విధంగా కేంద్రం కొత్త నిర్ణయం తీసుకొచ్చింది. ఈ ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కు ఏడాదికి రూ.3 వేలు చెల్లించాలి.ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200 సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200 సార్లు ఏది ముందైతే దానిని పరిగణనలోకి తీసుకుంటారు.వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు అవకాశం ఉండదు.రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లో టోల్‌గేట్ల వద్ద సాధారణ పద్ధతి లో ఫాస్టాగ్ ద్వారా టోల్ ఫీ చెల్లించాలి.తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వద్ద సాధారణ ఫాస్టాగ్ ద్వారానే టోల్‌ఫీ చెల్లించాలి. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

టోల్ ఫీజు 15 రూపాయలే..

ఏడాది లేదా 200 సార్లు తిరిగేందుకు వీలుగా ఫాస్టాగ్ తీసుకోవడం వల్ల వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల ఒక ట్రిప్పునకు రూ.15 మాత్రమే పడుతుంది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా ద్వారా కారు, జీపు, వేన్‌లకు ఒకవైపు రూ.50 రుసుం ఉంది. దీని ప్రకారం 200 సార్లు ఇవి తిరిగితే పాత పద్ధతిలో రూ.10 వేలు అవుతుంది. కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 200 ట్రిప్పులకు రూ.22 వేలు, ఈతకోట వద్ద టోల్ ప్లాజా వద్ద రూ.25వేలు అవుతుంది. రాష్ట్రంలోని ఇతర టోల్‌ప్లాజాల వద్ద ఇంతకంటే అధిక రుసుములు వసూలు చేస్తున్నారు. నూతన విధానంలో ఒక్కొక్కచోట రూ.15 మాత్రమే కట్ అవుతుంది. దాంతో 200 సార్లకు రూ.3 వేలు చెల్లిస్తే సరిపోతుంది. బ్యాలెన్స్ అయిపోతే మళ్లీ రీచార్జి చేసుకుంటే అదే ప్యాకేజీ వర్తిస్తుంది.

రైతులు పాస్..పాస్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి రైతులకు ప్రభుత్వం కొత్తగా పట్టాదారు పాసపుస్తకాలు పంపిణీ చేయనుంది. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అధికారులు అందించబోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అసలు పాసపుస్తకాల జారీయే పెద్దగా జరగలేదు. అప్పటి సీఎం జగన్ అస్తవ్యస్త విధానాలతో చేపట్టిన భూసర్వే పేరుతో మరింత తలనొప్పి పెరిగింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మునుపటిలా ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాల జారీకి రెవెన్యూశాఖ నిర్ణయించింది. ఎట్టకేలకు ఇవన్నీ ప్రింటింగ్ పూర్తి చేసుకుని జిల్లాలకు చేరుకున్నాయి. గత వైసీపీ హయాంలో కాకినాడ జిల్లా 15 మం డలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150 కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. నేటి నుంచి రీసర్వే పూర్తిచేసుకున్న గ్రామాల్లో పం పిణీ చేయనున్నారు.కాకినాడ జిల్లాలో 1.47 ల క్షలు, కోనసీమ జిల్లాలో 1.02 లక్షలు,తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల వరకు పాస్ బుక్‌లు ఇవ్వనున్నారు.ఇకపై స్వేచ్ఛగా రైతులు భూముల క్రయవిక్రయాలు,బ్యాంకు రుణాలు తెచ్చుకోవచ్చు.

మువ్వన్నెల పండుగకు ముస్తాబు

స్వాతంత్ర్య వేడుకలకు బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లు చేసిన అధికారులు

ముఖ్య అతిథి మంత్రి సుభాష్‌తో పతాకావిష్కరణ

మూడు రంగుల హంగులతో ముస్తాబైన కలెక్టరేట్

అమలాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరగనున్న స్వాతంత్ర్య వేడుకలకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. స్టేడియంలో ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. బుధవారం నాటి వర్షం కారణంగా స్టేడియం జలదిగ్బంధానికి గురైనప్పటికీ గ్రౌండ్‌లో ఉన్న నీటిని బయటికి మళ్లించడం, పరేడ్ నిర్వహణ, ఇతర ఏర్పాట్లకు సంబంధించి ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన అధికారులు చేపట్టారు. అతిథులు గౌరవ వందనం స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక వేదిక ఏర్పాటుచేయడంతోపాటు ఇరువైపులా అతిథులు ఆశీనులయ్యేందుకు ప్రత్యేక కుర్చీలతో ఏర్పాట్లను సిద్ధం చేశారు. పోలీసులు ఇప్పటికే పరేడ్ నిర్వహణకు అవసరమైన సన్నద్ధతతను పూర్తి చేసుకున్నారు. పోలీసు బెటాలియన్‌తోపాటు బ్యాండు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి జిల్లాకు చెందిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావులు, ఇతర ప్రజాప్రతినిధులు గౌరవ వందనం స్వీకరించనున్నారు. పరేడ్ అనంతరం సూపర్-6 పథకాలతోపాటు సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన శకటాల ప్రదర్శనకు వాహనాలను సిద్ధం చేశారు. నల్లవంతెన దిగువనున్న కలెక్టరేట్ కార్యాలయ భవనాల ప్రాంగణాలను జాతీయ జెండాలను పోలిన రంగులు కలిగిన విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జరగనున్న మంత్రి సుభాష్‌తో జాతీయ పతాకావిష్కరణ, 9.05 గంటలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరణ, 9.15 నుంచి మంత్రి ప్రసంగం ఉంటుంది. 9.30 గంటలకు పోలీసులు కవాతు నిర్వహిస్తారు. తర్వాత ప్రభుత్వ ప్రగతి శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, అధికారులకు ప్రశంతాపత్రాలు అందజేస్తారు.

సిద్ధమైన పరేడ్ గ్రౌండ్



స్వాతంత్ర్యోద్యమంలో వారంతా రా'రాజులు'



కాశిన వెంకటరత్నం భూపతిరాజు జగ్గరాజు నడింపల్లి బంగార్రాజు నడింపల్లి జగ్గరాజు నడింపల్లి రామచంద్రరాజు నడింపల్లి సుబ్బరాజు

(ఆంధ్రజ్యోతి - అమలాపురం రూరల్)

భరతమాత దాస్యశృంఖలాలను తెంచేందుకు ఆనాడు ఎందరో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలంలోని జంట గ్రామాలుగా గుర్తింపు పొందిన వన్నెచింతలపూడి, రంగాపురం గ్రామాలే గుర్తుకు వస్తాయి. ఆ రెండు గ్రామాల నుంచి 17 మంది స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపినవారే. వారికి అండగా ఎప్పుడూ వందమందికి పైగా అనుచరులు ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమ పురిటిగడ్డలు ఆ గ్రామాలు అయితే.. ఉద్యమాన్ని ముందుండి నడిపించింది అందరు రారాజులే. వన్నెచింతలపూడి గ్రామం నుంచి నడింపల్లి కుటుంబీకులే స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించారు. ఒకే కుటుంబానికి చెందిన నడింపల్లి జగ్గరాజు, భీమరాజు, వెంకటపతిరాజు, రామభద్రరాజు సోదరులు స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. ఒకే కుటుంబం నుంచి నలుగురు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఘనత ఆ కుటుంబానికే దక్కుతుంది. ఈ గ్రామం నుంచి నడింపల్లి బంగార్రాజు ఆధ్వర్యంలో నడింపల్లి సీతారామరాజు, నడింపల్లి భీమరాజు, నడింపల్లి జగ్గరాజు, నడింపల్లి వెంకటపతి రాజు, నడింపల్లి విశ్వనాధరాజు, నడింపల్లి సుబ్బరాజు(సాధురాజు), నడింపల్లి రామమూర్తి రాజు, నడింపల్లి సత్యనారాయణరాజులతోపాటు భూపతి రాజు సుబ్బరాజులు స్వాతంత్ర్యోద్యమంలో జైలు జీవితం గడిపినవారే. అదేవిధంగా రంగాపురం గ్రామానికి చెందిన భూపతిరాజు జగ్గరాజు ఆధ్వర్యంలో భూపతిరాజు సూర్యనారాయణ రాజు, భూపతిరాజు రామరాజు, భూపతిరాజు రామచంద్రరాజు, భూపతిరాజు వెంకటపతిరాజులతోపాటు నడింపల్లి సత్యనారాయణ రాజు, నడింపల్లి సుబ్బరాజులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జైలు జీవితాలు గడిపినవారే. తమ యావదాస్తులను ఉద్యమానికి అర్పించిన వారే.

జగ్గరాజు ఖైదీ నంబరు 5282

వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన నడింపల్లి జగ్గరాజు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 1930జూలై 8న బ్రిటీషు పోలీసులు అరెస్టు చేశారు. ఆరు నెలలు జైలు శిక్ష విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీ నంబరు 5282 కింద ఉన్నారు. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 1932 జనవరి 18న మరోసారి ఆయన అరెస్టు అయ్యారు. ఆయనకు ఆరు నెలలు జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా నెల 15 రోజులు జైలుశిక్ష అనుభవించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో బళ్లారిలోని సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పట్లో గ్రామంలోని ఐదు ఎకరాల భూమిని విక్రయించి రూ.500 జరిమానా చెల్లించడంతో ఆరు నెలల జైలు శిక్ష అనంతరం విడుదలయ్యారు. బళ్లారిలోని సెంట్రల్ జైలులో జగ్గరాజుతోపాటు నీలం సంజీవరెడ్డి కూడా జైలు శిక్ష అనుభవించారు. వారిద్దరూ జైలుమేట్స్. అనంతర కాలంలో సంజీవరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో జగ్గరాజును గుర్తు పెట్టుకుని మరీ ఆయన యోగక్షేమాలను సంజీవరెడ్డి అడిగేవారు.

సైకిల్‌పై తిరుగుతూ...

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో సైకిల్‌పై తిరుగుతూ ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న ఘనత నడింపల్లి బంగార్రాజుకు దక్కుతుంది. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా 1930 దశకంలోనే మద్రాసు, రాజమహేంద్రవరం, బళ్లారి సెంట్రల్ జైళ్లలో ఎన్నో నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత బంగార్రాజుతో పాటు పలువురికి కేంద్ర ప్రభుత్వం తామ్రపత్రాలు అందించారు. బంగార్రాజుకు పెన్షన్‌తో పాటు ప్రభుత్వం భూమిని అప్పగించింది. అయితే వాటిని ఆయన తృణప్రాయంగా త్యజించారు. బంగార్రాజుకు కేటాయించిన భూమిని భూదాన ఉద్యమంలో వినోభాబావేకు అప్పగించారు.

ఉత్తరాలపై నిఘా..

స్వాతంత్ర్యోద్యమంలో ఉద్యమవీరులపైనే కాకుండా తపాలాశాఖ ద్వారా బట్వాడా అయ్యే ఉత్తరాలపై కూడా నిఘా పెట్టారు. అప్పట్లో భూపతిరాజు జగ్గరాజు ఉద్యమంలో భాగంగా కొరియర్‌గా పనిచేశారు. పోస్టుకార్డుల ద్వారానే ఉద్యమ సమాచారాన్ని రహస్యంగా పంపిస్తున్నారన్న విషయాన్ని బ్రిటీషు పోలీసులు ఆలస్యంగా గుర్తించి వెంటనే ఉత్తరాలపై సైతం నిఘా పెట్టారు. ఉభయగోదావరి జిల్లాల్లో కొరియర్‌గా పనిచేసిన జగ్గరాజు 1932లో ఉద్యమానికి సంబంధించిన ఉత్తరాన్ని రహస్యంగా తుని చేరవేస్తుండగా పిఠాపురంలో పోలీసులు ఆయన్ను అడ్డగించారు. రహస్య సమాచారాన్ని గుర్తించి జగ్గరాజును తీవ్రంగా కొట్టి పంట పొలాల్లో పడవేశారు. కొన ఊపిరితో ఉన్న జగ్గరాజును స్థానికులు రక్షించడంతోపాటు స్వగ్రామానికి చేర్చారు.

సాధు ఆశ్రమంలోనే వైద్య సేవలు

వన్నెచింతలపూడిలో స్వాతంత్ర్యోద్యమకారుడైన నడింపల్లి సుబ్బరాజు (సాధురాజు) ప్రకృతి వైద్యునిగా పనిచేసేవారు. ఉద్యమంలో ఎవరికి గాయాలైనా ఆ ఆశ్రమానికి తరలించేవారు. వారికి వైద్యసేవలు అందించిన అనంతరం విశ్రాంతి తీసుకునేందుకు మరో ఆశ్రమాన్ని మరికొంత దూరంలో ఆయనే రహస్యంగా ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్య యోధులెందరికో వైద్యసేవలను రాజు అందించారు.

మహాత్మునితో కలిసి నడిచిన వెంకటరత్నం

ఆగర్భ శ్రీమంతునిగా జన్మించిన కాశిన వెంకటరత్నం దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు చూపిన బాటలో నడిచారు. బండారులంకకు చెందిన వెంకటరత్నం 14వ ఏటనే స్వాతంత్ర్యోద్యమ బాటపట్టారు. మహాత్మాగాంధీతో కలిసి జైలు జీవితాన్ని గడిపారు. 1929 మే 5న కోనసీమ పర్యటనకు వచ్చిన మహాత్మునితో కలిసి వెంకటరత్నం పర్యటించారు. వెంకటరత్నం ఉద్యమం కోసం ఆస్తులు తరిగిపోతున్నా పట్టించుకోలేదు. టంగుటూరి ప్రకాశంపంతులు ప్రధాన అనుచరునిగా ఆయన గుర్తింపు పొందారు.



అమరుల నేల 'వాడపల్లి'

దేశభక్తితోపాటు దైవభక్తిని చాటుకున్న నేలగా వాడపల్లి చారిత్రకతను సంతరించుకుంది. 1931 మార్చి 30 ఏకాదశి రోజున శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణంలో భాగంగా రథోత్సవంపై మహాత్మాగాంధీ చిత్రపటాన్ని, జాతీయ పతాకాన్ని దేశభక్తులు ఎరుగవేశారు. గాంధీ చిత్రపటాన్ని, మువ్వెన్నల జెండాను తొలగించాలని బ్రిటీష్ పోలీసు అధికారి ముస్తాఫ్అలీఖాన్ ఆదేశించారు. దేశభక్తులు ఎంతకీ ససేమిరా అనడంతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పలువురు అశువులుబాశారు. కొంతమంది గాయాలపాలయ్యారు. కోపోద్రిక్తులైన దేశభక్తులు.. ముస్తాఫ్అలీఖాన్ అనుకుని శానటరీ ఇన్‌స్పెక్టర్‌ను హతమార్చారు. 1987 అక్టోబరు 2న గాంధీ జయంతి నాడు మాజీ ఎమ్మెల్యే, గాంధేయవాది మంతెన వెంకట సూర్యసుబ్బరాజు ఆలయం వద్ద స్వాతంత్ర్య సమరయోధుల స్తూపాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండడంతో కొత్తగా నిర్మిస్తున్న కోనేరు వద్ద స్మారక స్తూపాన్ని మార్పుచేయడానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చర్యలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి, ఆత్రేయపురం



అలనాటి జ్ఞాపకాలు.. గాంధీజీ మ్యూజియం

స్వాతంత్ర్యోద్యమ సమయంలో 1921 నుంచి 1929 మధ్యలో మూడుసార్లు గాంధీజీ కాకినాడ వచ్చారు. గాంధీజీ ఇక్కడికి వచ్చినప్పటి విషయాలతోపాటు ఆయన బాల్యం నుంచి స్వాతంత్ర్యం సాధించి వరకు ఉన్న జీవిత ఘట్టాలను తెలియజేస్తూ కాకినాడ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో గాంధీభవన్ ఏర్పాటుచేశారు. ఇందులో గాంధీజీ మ్యూజియం, ఆయన చిత్రపటాలతో పాటు 400 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయనను నిత్యం స్మరించుకునేలా గాంధీనగర్లో ఓ పార్కుకు గాంధీపార్కుగా, ఓ ప్రాంతానికి గాంధీనగర్‌గా అప్పట్లోనే నామకరణం చేశారు. కాకినాడ గాంధీభవన్ పేరున కరపలో 5.87 ఎకరాల భూమి ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల వెంకట సుబ్బారావు 1952 ఆగస్టు 5న తన స్వార్జిత భూమిని గాంధీ భవన్ ట్రస్టుకు రాసిచ్చారు. ఇక కాకినాడలో గాంధీ మూడుసార్లు పర్యటించారు. 1921 ఏప్రిల్ 3న కాకినాడలో గాంధీజీ దంపతులు, వారి నాలుగో కుమారుడు రైలు దిగి గుర్రపు బండిపై జగన్నాథపురంలోని పైడా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్నారు. 1923 డిసెంబర్ 28న గాంధీనగర్లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలకు నెహ్రూ, పటేల్ వంటి నేతలు విచ్చేయగా, పరవాడ జైలులో ఉన్న కారణంగా గాంధీ హాజరు కాలేదు. ఆ తర్వాత 1930, 1933ల్లో రెండుసార్లు కాకినాడ వచ్చారు.

- ఆంధ్రజ్యోతి, కాకినాడ కార్పొరేషన్

తొలిరోజు పండుగ ఇలా..



టంగుటూరి ప్రకాశంపంతులు ఆధ్వర్యంలో అప్పట్లో వెలువడిన స్వరాజ్య పత్రికలోనే స్వాతంత్ర్యోద్యమ సమాచారమంతా ఉండేది. అటువంటి మహనీయునితోపాటు క్రొవ్విడి లింగరాజు, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగేశ్వరరావు, కళా వెంకట్రావు వంటి సమరయోధులను చూడగలిగాను. 1930 మే31న జన్మించాను. రాజమహేంద్రవరం ట్రైనింగ్ కళాశాలలో ఎస్ఎస్ ఎల్సీ పూర్తిచేసి 1947లో ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో చేరాను. అదే సంవత్సరం ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత దేశానికి స్వాంత్రంత్యం ప్రకటించారు. 15వ తేదీ ఉదయం నుంచి కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది. తామంతా జాతీయ పతాకాలను చేతబూని ర్యాలీలు నిర్వహించాం.

- చీర్ల సాంబశివరావు, విశ్రాంత హెచ్‌ఎం, అమలాపురం



పేరూరు హైస్కూలులో ఫోర్తుఫారం చదువుతున్నా. ఎలా తెలిసిందో ఏమో 1947 ఆగస్టు 15వ తేదీ ఉదయం 5 గంటలకల్లా విద్యార్థులంతా పాఠశాలకు రావాలని ముందే హెచ్‌ఎం చెప్పారు. చెప్పినట్టుగానే పాఠశాలకు వెళ్లగా అక్కడంతా పండుగ వాతావరణమే. మహాత్మాగాంధీకి జై, వల్లభాయ్ పటేల్‌కు జై, సుభాష్‌చంద్రబోస్‌కు జై, నెహ్రూకు జై అంటూ విద్యార్థులంతా కలిసి జాతీయ పతాకాలను చేతబూని గ్రామమంతా ర్యాలీ నిర్వహించాం. ఉదయం అల్పాహారం అనంతరం స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపుతూ దేశభక్తిని చాటేలా ప్రదర్శనలు ఇచ్చారు. 1933 ఫిబ్రవరి 22న జన్మించిన నేను స్వాతంత్ర్య తొలి వేడుకల్లో పాల్గొనడం అదృష్టం.

- యిళ్ల వెంకట శ్రీనివాసరావు, విశ్రాంత డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, అమలాపురం

మహాత్ముడు నడిచాడిచట.. 1933లో మహాత్మాగాంధీ సామర్లకోట రాక

మహాత్మాగాంధీ 1933లో సామర్లకోటలో పర్యటించారు. మహాత్ముడు తన శిష్య బృందంతో కలసి కలకత్తా(హౌరా) నుంచి మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలులో సామర్లకోట రైల్వే స్టేషన్‌కు డిసెంబరు 24న ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాం నుంచి రైలు దిగిన గాంధీని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు చేరుకోవడంతో సామర్లకోట రైల్వే స్టేషన్ ప్రజలతో కిక్కిరిసింది. అప్పటి కాంగ్రెస్ నాయకులు, భారత స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధులు బులుసు సాంబమూర్తి తదితర నాయకుల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీని ఘనంగా స్వాగతించారు. సామర్లకోట నుంచి ప్రత్యేక వాహనంపై ఆశీనులైన మహాత్మాగాంధీ పెద్దాపురం తరలివెళ్లారు. పెద్దాపురంలో ముప్పనవారి బంగ్లా ఆవరణలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. సుమారు పదిహేను వేల మంది సమీప ప్రాంతాల నుంచి ఈ సభకు హాజరుకావడం విశేషం. నాటి సభ ముగిసిన అనంతరం పెద్దాపురం మున్సిపాల్టీ పక్షాన ఛైర్మన్ ఎన్.సుబ్బారావుతో స్వాగతపత్రాన్ని, పౌరుల తరఫున మరొక సన్మానపత్రాన్ని సభాముఖంగా చదివి వినిపించి అందించారు. అనంతరం గాంధీకి హరిజననిధికి రూ.501 విరాళాన్ని అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, సామర్లకోట



నాగుల్లంకలో ఏర్పాటుచేసిన స్తూపం

సమరయోధుల గ్రామం నాగుల్లంక



స్వాతంత్ర్య సమరయోధుడు ఆరుమిల్లి సుబ్బారావుకు 1972లో ప్రభుత్వం అందించిన తామ్రపత్రం

స్వాతంత్ర్య ఉద్యమం జరిగిన సమయంలో పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామానికి చెందిన 22 మంది వ్యక్తులు సమరంలో పాల్గొని దేశానికి స్వతంత్రం సంపాదించడంలో భాగస్వాములయ్యారు. అందుకుగాను అప్పట్లో ప్రభుత్వం 22 మందిలో ఐదుగురికి తామ్రపత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. ఒకే గ్రామంలో 22 మంది స్వాతంత్ర సమరయోధులు ఉండడంతో ఆనాటి నుంచి ఆ గ్రామం స్వాతంత్ర సమరయోధుల గ్రామంగా ప్రసిద్ధిగాంచింది. అంతే కాకుండా స్వతంత్ర సమరంలో చేసిన సేవలకు గుర్తుగా ప్రధానపంటకాల్వకు వంతెన, కాల్వ చెంతనే వారి పేర్లతో స్తూపాన్ని ఏర్పాటుచేసి ప్రతి ఏడాది స్థానిక నాయకులతో కలసి గ్రామస్తులు ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేసి వారికి నివాళులు అర్పిస్తారు.

- ఆంధ్రజ్యోతి, పి.గన్నవరం



రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాలుగు రోజులు జరిగే రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. కొంతసేపు బాస్కెట్‌బాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బాలబాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ ఛైర్మన్ పి.సురేష్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు), పిఠాపురం అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, కొత్తెం సుందరకుమార్, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బాలికల విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

గైనిక్ పేషెంట్లకు ప్రత్యేక ఓపీ

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గైనిక్ పేషెంట్ల సౌకర్యార్థం కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి గురువారం తెలిపారు. గైనిక్ విభాగంలోని ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్ద తల్లీబిడ్డ విగ్రహం ఎదురుగా ఉన్న గేటులోకి రావాలన్నారు. ఓపీ టికెట్, డాక్టర్ కన్సల్టేషన్, రక్త పరీక్షలు, మందులు అన్నీ ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్దే జరిగేలా ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ వెల్లడించారు. ప్రజలు ఈ మార్పును గమనించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దుబాయ్‌లో వెల్డర్స్‌గా ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దుబాయ్ (యూఏఈ) దేశంలో వెల్డర్స్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వయసు 24 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండి, ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత కలిగి నాలుగేళ్ల అనుభవం ఉండాలన్నారు. టీఐజీ లేదా ఏఆర్సీ మల్టీ వెల్డర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.52వేల నుంచి రూ.61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52వేల వరకు వేతనం ఇస్తారన్నారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్లు ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యాలతో పాటు స్వదేశానికి ఒకసారి వచ్చి వెళ్లడానికి టిక్కెట్ ఇస్తారన్నారు. రూ.35వేలు (వీసా, ట్రావెల్ టికెట్లు, క్యూవీసీ మొదలైన ఖర్చులకు). ఆసక్తి గల వారు పాస్‌పోర్టు, అనుభవం, సంబంధిత విద్యా ధ్రువ పత్రాలతో ఆగస్టు 31వ తేదీలోగా వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8712655686, 9988853335, 8790118349, 8790117279 నెంబర్లను సంప్రదించాలని కోరారు..



డేవిడ్



హెబెల్

జాతీయ హాకీ పోటీలకు ఉప్పాడ కొత్తపల్లి విద్యార్థుల ఎంపిక

కొత్తపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లికి చెందిన చొక్కా డేవిడ్, మేరుగు హెబెల్ జాతీయ హాకీ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీ, హాకీ కోచ్ రవిరాజు తెలిపారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులకు టేబుల్ టెన్నిస్ సీనియర్ క్రీడాకారుడు రావు చిన్నారావు, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాసరావు, గంటా విజయ్‌కుమార్, పలువురు గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

నేనూ ర్యాగింగ్‌కు భయపడ్డా..



కలెక్టర్ ప్రశాంతికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ, విద్యార్థులు

- అది ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది
- తూర్పు కలెక్టర్ ప్రశాంతి
- నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాలు

దివాన్‌చెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తన జీవితంలో కూడా ర్యాగింగ్‌కు భయపడిన సంఘటనలు ఉన్నాయని, ర్యాగింగ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాల్లో మూడో రోజైన గురువారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ర్యాగింగ్ ఉండని విద్యాలయాల్లో తమ పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు ఇష్టపడతారని, పిల్లలు కూడా అటువంటి వాటిలో చేరడానికే సుముఖత చూపిస్తారన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు భయపడి విద్యకు దూరమైన విద్యార్థులు అనేక మంది ఉన్నారన్నారు. తాను చదువుకునేటప్పుడు ర్యాగింగ్‌కు భయపడి సెలవులు పెట్టిన సందర్భాలు ఉన్నాయని, అటువంటి పరిస్థితులు ఏ విద్యార్థికి రాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాల గౌరవం, పేరు ప్రఖ్యాతులు విద్యార్థుల ప్రవర్తనపై ఆధారపడి ఉంటాయని, సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని, మార్గనిర్దేశకులుగా వ్యవహరించాలని సూచించారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ర్యాగింగ్ ఒక వ్యక్తి మనస్సును మచ్చగా మార్చుతుందని, వారి కలలను పూర్తిగా నాశనం చేసే హానికరమైన చర్య అని అభివర్ణించారు. యూనివర్శిటీలో భయానికి స్థానం లేదని. ఆకాంక్ష, గౌరవం మాత్రమే ఉండేలా చూసుకుందామని చెప్పారు. రాజానగరం మహిళా ఎస్ఐ పి.నారాయణమ్మ శక్తి యాప్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుత నన్నయ విగ్రహానికి కలెక్టర్, వీసీ పూలమాలలతో నివాళులర్పించారు.అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమం అనంతరం కలెక్టర్ ప్రశాంతిని వీసీ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ కేవీ స్వామి, డీన్ ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్పీ మురళీకి మహోన్నత సేవా పతకం



రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో చేసిన సేవలకు జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వ మహోన్నత సేవా పతకం లభించింది. 1989లో ఎస్ఐగా సర్వీసులో చేరిన మురళీ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు హోదాల్లో పని చేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. నరసాపురం డీఎస్పీగా పని చేస్తూ అడిషనల్ ఎస్పీ ఉద్యోగోన్నతిపై తూర్పు గోదావరికి గత ఏడాది నవంబరులో వచ్చారు. మండపేట రూరల్, అంగర, పెదవేగి, చందర్లపాడు, అనపర్తి సర్కిల్, రాజమండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న సమయంలో స్థానికుల సహకారంతో పోలీస్ స్టేషన్ భవనాలను నిర్మించారు. హైదరాబాద్‌కు చెందిన ఒక కేసు ఛేదనలో అద్వితీయమైన ప్రతిభ చూపినందుకు రూ.5 లక్షల రివార్డు అందుకున్నారు. 2009లో ఏలూరులో ఎలక్షన్ స్పెషల్ బ్రాంచి సీఐగా ఉన్నప్పుడు సేవా పతకం, 2017లో రామచంద్రాపురంలో డీఎస్పీగా ఉన్నప్పుడు ఉత్తమ సేవాపతకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్, అడిషనల్ ఎస్పీలు అర్జున్(క్రైమ్స్), సుబ్బరాజు(శాంతి భద్రతలు), చెంచురెడ్డి(ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది మురళీ కృష్ణకు అభినందనలు తెలిపారు.

'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలి'

వివిధ జిల్లాల ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పిఠాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గురువారం కాకినాడ జిల్లా పిఠాపురంలోని జనసేన కార్యాలయానికి వచ్చారు. తమ సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరుతూ జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా వేతనంతో పాటు పీఎఫ్, ఈహెచ్ఎస్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. తమకు సరైన వేతనం లేదని, పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తే సమస్యలు పరిష్కారమవుతాయని ఇక్కడకు వచ్చామని వారు చెప్పారు.

పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పాటు తెలంగాణ పరివాహకంలో లక్ష్మి బ్యారేజ్ నుంచి సుమారు 3లక్షల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండడంతో గోదావరి ప్రవాహం స్వల్పంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి 1,98,959 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. డెల్టా పరిధిలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల డెల్టా కాలువలకు సాగునీటి విడుదలను గణనీయంగా తగ్గించారు. తూర్పు డెల్టాకు 2000, మధ్య డెల్టాకు 700, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి 19.60 అడుగులుగా నమోదయింది.

రేపు, ఎల్లుండి పోలవరం నిర్వాసిత ప్రాంతాల్లో

సీపీఎం నాయకుల పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ నెల 16, 17 తేదీల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారని తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం నాయకులు 16వ తేదీ ఉదయం 11గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి పోలవరం దేవీపట్నం మండలంలో నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. 17న చింతూరు మండలంలోని నిర్వాసితుల కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు.



స్వాతంత్ర్య సందేశం..

– కడియం (ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కడియం పల్ల వెంకన్న నర్సరీలో రైతులు సత్తిబాబు, వెంకటేష్, వినయ్ మొక్కలతో త్రివర్ణ పతాకం తీర్చిదిద్దారు. బోర్డర్ రకానికి చెందిన కొన్ని వేల మొక్కలతో మేడిన్ ఇండియా, ఇండిపెండెన్స్ వంటి అక్షర రూపాలు ఇవ్వడంతో పాటు 3రంగుల జెండా తీర్చిదిద్దారు. కూర్పులో 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుతూ అమెరికా వంటి సంపన్న దేశాలు తీసుకున్న నిర్ణయంతో రూపాయి విలువ తగ్గకుండా మనమే స్వదేశీ వస్తువులకు కొనుగోళ్లకు ప్రాధాన్యమివ్వాలని సందేశం ఇచ్చారు.

ఆనాటి ప్రయాణం.. నేటి ఉచితానికి మార్గం!

- కోనసీమ జిల్లా అలమూరులో రెండేళ్ల క్రితం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన చంద్రబాబు
- ఉచిత బస్సు సౌకర్యం హామీపై ప్రయాణికులతో చర్చ
- స్త్రీ శక్తి పథకానికి అదే స్ఫూర్తి





ఆలమూరులో రెండేళ్ల క్రితం బస్సులో ప్రయాణం చేసిన చంద్రబాబు చిత్రాలు

అలమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఈ పథకం అమలులోకి వచ్చింది. స్త్రీశక్తి పేరుతో ఈ పథకాన్ని రూపొందించారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ 5 రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా మహిళలు ప్రయాణించవచ్చు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల పర్యటనకు వచ్చినప్పుడు ఆలమూరు నుంచి జొన్నాడ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఉచిత బస్సు సౌకర్యం హామీకి సంబంధించి మహిళా ప్రయాణికులతో చర్చించారు. 2023 ఆగస్టు 18న ఈ బస్సు ప్రయాణం చేశారు. ఈ పథకం రూపకల్పనకు సంబంధించి అనేక మంది మహిళా ప్రయాణికులతో ఆయన సమీక్షించి సూపర్ సిక్స్ హామీగా చేర్చారు. ఇప్పుడు ఆ పథకం అమలు చేస్తుండడంతో కొత్తపేట నియోజకవర్గంలో అప్పటి చంద్రబాబు ఆలమూరు బస్సు ప్రయాణం గుర్తించి చర్చించుకుంటున్నారు. ఉచిత బస్సు పథకానికి ఆలమూరు బస్సు ప్రయాణం స్ఫూర్తిగా భావిస్తున్నారు. ఆ ప్రయాణంలో చంద్రబాబు నాయుడుతో పాటు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మాజీ జడ్పీటీసీ దండంగి మమత తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ముగ్గురి అరెస్ట్

34 వాహనాలు స్వాధీనం

డీఎస్పీ రమేశ్ బాబు



రాజమహేంద్రవరంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీసులు ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు గురువారం వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గామన్ బ్రిడ్జి వద్ద త్రీటౌన్ సీఐ వి.అప్పారావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పోలీసులు ప్రశ్నించారు. ద్విచక్రవాహనాల దొంగతనాల కేసుల్లో వాళ్ల నిందితులుగా ఉన్నారని గుర్తించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన కుప్పాల రంగారావు, స్నేహితులు గోపిరెడ్డి యోహాను, మెకానిక్ సిర్రా బంగారుబాబును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేశారు. త్రీటౌన్, భీమవరం, గుడివాడ, ఏలూరు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి 17 మోటారు సైకిళ్లతో కలిపి రూ.14లక్షల విలువైన మొత్తం 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. విధుల్లో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ వి.అప్పారావు, ఎస్ఐ వి.అప్పలరాజు, హెచ్ సీలు వి.కృష్ణ, ఎస్.వెంకటరామయ్య, కె.సురేశ్, చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు బి.విజయ్‌కుమార్, మహేశ్, పవన్‌ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

'నగరం'లో అర్బయిన్ కార్యక్రమాలు ప్రారంభం

మామిడికుదురు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇరాక్‌లోని కర్బలా పుణ్యభూమిలో ఇమామ్ హుస్సేన్ అతని 72 మంది పరివారం వీర మరణం పొందిన సంఘటన జరిగిన 40 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం నిర్వహించే అర్బయిన్ కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదరు మండలం నగరంలో ఇమామ్ అలీరజా పంజాలో మజ్లిస్ జరిగింది. అనంతరం హమారీలను తీసి నౌహాలను ఆలపిస్తూ ఒంటెలపై నగరంలోని మంజిలే కర్బలా వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ ఉరుహేతాజ్‌దారే పురాత్ ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. ఈ మజ్లిస్‌లో మత గురువు కర్బలా పుణ్యభూమిలో జరిగిన సంఘటనను భక్తులకు వివరించగా కన్నీరుమున్నీరుగా విలపించారు. కార్యక్రమాల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు.



కోనసీమ జిల్లా నగరంలో ఒంటెలపై హమారీలు ఊరేగింపు చేస్తున్న ముస్లింలు

ఇకపై అందరికీ ఒకే నియమావళి!

- ఎన్‌టీఆర్ భరోసా పింఛను అర్హత ధ్రువీకరణ పత్రాల మంజూరుకు నిబంధనలు విడుదల
- రాష్ట్రమంతా ఒకే నియమావళిని వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో అర్హులను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసేందుకు రాష్ట్రమంతా ఒకే నియమావళిని వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ అయినట్టు కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో వివిధ దీర్ఘకాలిక వ్యాధుల బారినపడే వారిని నెలవారీ పెన్షన్లకు అర్హులుగా గుర్తిస్తామని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

దీర్ఘకాలిక రుగ్మతలు, వాటికి వర్తించే పెన్షన్ల వివరాలివి..

రూ.10వేల పింఛను కేటగిరీ అర్హులు: తలసేమియా మేజర్ వ్యాధిగ్రస్తులు, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, అతి తీవ్ర హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు, రెండు కాళ్లకు తీవ్ర బోద(గ్రేడ్-4) వ్యాధిగ్రస్తులు, 7 దీర్ఘకాలిక కిడ్నీవ్యాధితో డయాలసిస్ జరుగుతున్న, సీరం క్రియాటినిన్ 5కంటే ఎక్కువ లేదా కుంచించుకుపోయిన కిడ్నీ లేదా జీఎఫ్ఆర్ 15ఎంఎల్ కంటే తక్కువగా ఉన్న వ్యాధిగ్రస్తులు, కిడ్నీ లేదా కాలేయం లేదా గుండె మార్పిడి చేయించుకున్నవారు.

రూ.15వేల పింఛను కేటగిరీ అర్హులు: పక్షవాతంతో మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులు, సివియర్ మస్క్యులర్ డిస్ట్రోఫీతో మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులు.

రూ.6వేల పింఛను కేటగిరీ అర్హులు: బహుళ వైకల్యం కలిగిన కుష్ఠు వ్యాధిగ్రస్తులు, 40శాతం పైబడి దివ్యాంగత్వం ఉండి తెల్లరేషన్‌కార్డు కలిగినవారు.

పైఅనారోగ్యాలు కలిగిన వారికి ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో అర్హులను గుర్తించేందుకు ధ్రువపత్రాలు మంజూరుకు రాష్ట్రమంతా ఒకే నియమావళి ఉంటుందని, ధ్రువపత్రాల దాఖలు చేయడానికి ఈ కింది నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో తెలియజేశారు.

1. అర్హులకు జారీ చేసిన సర్టిఫికెట్లు అన్నీ పూర్తి సమాచారంతో ఉండాలి.
2. మెడికల్ సర్టిఫికెట్లపై ఏ రకమైన దిద్దుబాట్లు ఉండకూడదు.
3. మెడికల్ సర్టిఫికెట్‌పై జారీ చేసే ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డ్ డాక్టర్ల సంతకంతోపాటు స్టాంప్, పేరు, డాక్టర్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలి.
4. ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పథకంలో పైఅనారోగ్య విభాగాల్లో రోగి ఏ కోవకు చెందుతాడో వివరించి మంచానికి లేదా చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడో తెలియజేసే ధ్రువీకరణ పత్రంలో పొందుపర్చాలి.
5. ఇప్పటికే ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛను పొందుతున్న వారు, వారి పింఛను పెంచుకోవాలనుకుంటే సదరం ద్వారా నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందేందుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసేవారు కూడా సదరం పోర్టల్‌లో నమోదు చేసుకుని నూతన మెడికల్ సర్టిఫికెట్ దాఖలు చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు.
6. తీవ్ర అనారోగ్యంతో మంచానికి పరిమితమైన రోగులు అనవసరంగా కార్యాలయం చుట్టూ తిరగవద్దని ఆయన తెలిపారు. దీనిపై మరింత సమాచారం కావాల్సిన వారు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పింఛన్ల డీఈవో(కాకినాడ జిల్లా)ను 7981604598 నెంబరులో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ కోరారు.

రామచంద్రపురం జడ్పీటీసీ మేర్నీడి మృతి



మేర్నీడి (ఫైల్)

ద్రాక్షారామ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండల జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు(59) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున జడ్పీటీసీగా వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ద్రాక్షారామ పీఏసీసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. మేర్నీడి మృతి పట్ల మంత్రి సుభాష్, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం తెలిపారు. మృతదేహానికి మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు శ్యామ్, ఎంపీపీ అంబటి భవానీ నివాళులర్పించారు.

హోంగార్డుపై అత్యాచారం కేసు

ముమ్మిడివరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హైవే మొబైల్ వాహనంపై పనిచేస్తున్న హోంగార్డుపై గురువారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైంది. కోనసీమ జిల్లా కాట్రేనికోన పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా ఉన్న బి.నాగరాజు హైవే మొబైల్ వాహనంపై పనిచేస్తున్నాడు. ముమ్మిడివరానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఆమె ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. న్యాయం జరగడంలో జాప్యంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీంతో ముమ్మిడివరం పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.

ఆసుపత్రికెళ్తుండగా ఆగిన ఆయువు

వ్యాన్ ఢీకొని తండ్రి మృతి

సురక్షితంగా బయటపడ్డ కుమారుడు



బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

తాళ్లరేవు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం బైపాస్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. కాజులూరు మండలం శీలలంక గ్రామానికి చెందిన జల్లి బాలకృష్ణ (45) తన మూడేళ్ల కుమారుడికి ఆర్యోగం బాగోలేకపోవడంతో కుమారుడిని తీసుకుని ద్విచక్రవాహనంపై ముమ్మిడివరం ఆసుపత్రికి బయల్దేరాడు. వారి వాహనాన్ని సుంకపాలెం మంగళ్‌ఎంటర్‌ప్రైజెస్ ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వ్యాన్ ఢీకొంది. దీంతో బాలకృష్ణ తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు సురక్షితంగా బయటపడ్డాడు. బాలకృష్ణ భార్య 6నెలల గర్భిణి అని తెలిసింది. బాలకృష్ణ మృతదేహాన్ని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్, మోహన్‌బాబు సినిమాలకు పాటలు రాశా

ప్రముఖ సినీగేయ రచయిత మాస్టర్‌జీ



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలిసిన ప్రముఖ సినీ గేయ రచయిత మాస్టర్‌జీ

పి.గన్నవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ గీతాలకు సంబంధించి ఇప్పటి వరకు 1000 వరకు పాటలు రాశానని ప్రముఖ సినీగేయ రచయిత గంగాధరి మాస్టర్‌జీ అన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలిసిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఇప్పటివరకు 25 సినిమాల్లో పాటలు రాశానని... ముఖ్యంగా పవన్‌కల్యాణ్, మోహన్‌బాబు సినిమాలకు పాటలు రాశానని చెప్పారు. రంగులకల, అడవి నాతల్లిరో, మనో రమ సినిమాల్లో పాటలు పాడానని, 6 సినిమాల్లో నటించానని చెప్పారు. ముఖ్యంగా తాను రాసిన అందుకో దండాలు బాబా అంబేద్కరా, పవన్ కల్యాణ్ నటించిన జానీ సినిమాలో నారాజు గాకుర మా అన్నయా, గుడుంబా శంకర్ సినిమాలో కిల్లి కిల్లి నమిలాకా బాగున్నదే నాగమల్లి పాటలకు మంచి స్పందన వచ్చిందని ఆయన చెప్పారు. తెలుగు యునివర్శిటీ, ఆచార్య నాగార్జున యునివర్శిటీ, తెలుగు అకాడమీల నుంచి అవార్డులు పొందానని చెప్పారు. ప్రస్తుతం రెండవగది సినిమాతో పాటు మరో కొత్త సినిమాకు పాటలు రాస్తున్నాని చెప్పారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లోని జరగనున్న విశ్వజన కళామండలి 49వ వార్షికోత్సవ కార్య క్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఆహ్వానించడానికి వచ్చినట్టు మాస్టర్‌జీ పేర్కొన్నారు.

అంబులెన్స్ ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

కరప, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో గురువారం మధ్యాహ్నం అంబులెన్స్ ఢీకొని విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కరప పోలీసుల వివరాల ప్రకారం.. వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పి.పవన్‌భాస్కర్ హెచ్ఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లంచ్ బ్రేక్ సమయంలో కళాశాల బయటకు వచ్చి రోడ్డుపక్కన ఉన్న షాపు వద్దకు వెళ్లి వస్తుండగా కాకినాడ నుంచి మండపేటకు డిశ్చార్జ్ పేషెంట్‌ను తీసుకెళ్తున్న అంబులెన్స్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. విద్యార్థి తలకు తీవ్రగాయమవ్వగా అధ్యాపకులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌ను స్థానికులు వెంబడించి నిత్యానందపురంసెంటర్‌లో అదుపులోకి తీసుకుని డ్రైవర్, అంబులెన్స్‌ను కరప పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కిలోలు 100 ధర రూ.8,800

అంతర్వేదిలో భారీ సొర చేప

అంతర్వేది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో వేటకు వెళ్లిన మత్స్యకారులకు అరుదైన భారీ సొర చేప వలకు చిక్కింది. 100 కిలోల పైనే ఉన్న చేపకు వేలంపాట నిర్వహించగా రూ.8,800కు పలికింది.



కొబ్బరిముక్కలు.. కోట్లు!

సత్యదేవుడి సన్నిధిలో కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం

ఏడాదికి రూ.2.28 కోట్లు చెల్లించేందుకు గుత్తేదారు హెచ్చుపాట

అన్నవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిముక్కలు సత్యదేవుడికి సిరులు కురిపించాయి. స్వామివారి దర్శనం వ్రతమండపాల్లో భక్తులు టెంకాయిలు కొట్టి వదిలివెళ్లిన కొబ్బరిముక్కలు పోగు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో ఒక గుత్తేదారు ఏకంగా సంవత్సరానికి రూ.2.28 కోట్లు దేవస్థానానికి చెల్లించేందుకు హెచ్చుపాటను దక్కించుకున్నారు. గతేడాది వేర్వేరుగా నిర్వహించిన వేలంలో ఏడాదికి హెచ్చుపాట రూ.87.12 లక్షలు కాగా ఈ ఏడాది భారీస్థాయిలో ఆదాయం సమకూరింది. వీటితోపాటుగా బుకింగ్‌కౌంటర్ ఎదురుగా ఉన్న షాపింగ్‌కాంప్లెక్స్‌లో కొబ్బరికాయలు, ఇతర వస్తువులు విక్రయించుకునే లైసెన్స్‌హక్కుకు శుక్రవారం నిర్వహించిన వేలం ద్వారా ఏడాదికి రూ.45.47 లక్షలు హెచ్చుపాట దక్కించుకున్నారు. గతంలో ఇదే లైసెన్స్‌హక్కుకు రూ.27.96 లక్షలు మాత్రమే ఆదాయం సమకూరింది. ప్రకాష్‌సదన్ వెనక ప్రారంభించనున్న మొబైల్ క్యాంటీన్ లైసెన్స్ హక్కుకు తొలిసారి వేలం నిర్వహించగా రూ.33.84 లక్షలకు హెచ్చుపాట ఖరారయ్యింది. జ్యూస్‌పాయింట్ విక్రయ లైసెన్స్ హక్కు తక్కువ మొత్తానికి వెళ్లడంతో ఆ లైసెన్స్ హక్కు వేలం వాయిదా వేశారు. దేవదాయ కమిషనర్ అనుమతితో టెండర్లు ఫైనల్ చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సూపరెంటెండెంట్ వీవీరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో ఉచిత వరలక్ష్మి వ్రతాలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం ఉచిత సామూహిక శ్రావణ శుక్రవార వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నిత్యకల్యాణ మండపంలో ప్రారంభమవుతాయని, ఆసక్తి కలిగిన మహిళా భక్తులు వీటిలో పాల్గొనవచ్చన్నారు. మహిళలు టెంకాయి, అరటిపళ్లు తీసుకునివస్తే పూజాసామగ్రి, రవికల వస్త్రం, అమ్మవారి రాగిరూపు తదితర వాటిని దేవస్థానం సమకూరుస్తుందని ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

డ్రైవర్‌కు గాయాలు




ఘటనా స్థలంలో ఆటో,బస్సు.. ఆటోడ్రైవర్

ముమ్మిడివరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం కోనసీమ జిల్లా అమలాపురం నుంచి ఐ.పోలవరం మండలం తిలకుప్ప వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముమ్మిడివరం మండలం ఆర్టీసీ సెంటర్‌లో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోడ్రైవర్ అయిన కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన ఎలిపే కిశోర్ తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముచ్చటగా ముగ్గురు..

ఒకే కాన్పులో ఒక మగ, ఇద్దరు ఆడపిల్లల జననం... కొత్తపేటలో అరుదైన సంఘటన



తల్లి దుర్గ



ఒకే కాన్పులో పుట్టిన పిల్లలు

కొత్తపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో గురువారం అరుదైన సంఘటన జరిగింది. మహిళకు ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు జన్మించారు. ఈదరపల్లికి చెందిన కుంపట్ల దుర్గ గర్భిణి కావడంతో కొత్తపేటలోని భాస్కర చిల్డ్రన్ ఐవీఎం ఆసుపత్రి వైద్యుడు ప్రదీప్తికరుణను సంప్రదించింది. స్కానింగ్‌లో ముగ్గురు శిశువులు ఉండడాన్ని గుర్తించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆమెకు 8 నెలలకే నొప్పులు రావడంతో గురువారం ఆపరేషన్ ద్వారా మగబిడ్డ, ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారని.. పర్యవేక్షణలో ఉంచామని డాక్టర్ ప్రదీప్తికరుణ తెలిపారు.

జాతీయస్థాయి పారా ఒలింపిక్ పోటీలకు ముమ్మిడివరం విద్యార్థి



పార్థసంజీవ సాగర్

ముమ్మిడివరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం కొత్తలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి సబ్బతి పార్థసంజీవసాగర్ జాతీయస్థాయి పారా ఒలింపిక్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు గంగుల సురేష్ తెలిపారు. ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. ఈనెల29న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పార్థ పాల్గొననున్నాడు. విద్యార్థిని డీఈవో షేక్ సలీంబాషా, ఎంఈవోలు గౌరీశంకర్, ఉదయసాగర్, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఎస్సీ చైర్మన్ జైను బాబ్జి, హెచ్ఎమ్ గోవర్ధనగిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అమలాపురం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం మార్కెట్ వీధిలోని శ్రీపొట్టిశ్రీరాములు మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్సీ పోలిశెట్టి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ పతాకాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు.

భారీ వర్షానికి నీట మునిగిన పంట పొలాలు



అమలాపురం: కామనగరువులో చెరువును తలపిస్తున్న నాట్లు పూర్తి చేసుకున్న పంట పొలాలు

అమలాపురం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి మండల పరిధిలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగి తటాకాల(చెరువులు)ను తలపిస్తున్నాయి. నాట్లు పూర్తి చేసుకున్న పంట పొలాలన్నీ చెరువులుగా మారిపోయాయి. మండల పరిధిలోని వాసాలతిప్ప మేజర్ డ్రెయిన్, కుమ్మరికాల్వ డ్రెయిన్‌లు ఎగదన్నడంతో ముంపునీరు దిగే పరిస్థితి లేకుండా పోయింది. దాంతో కామనగరువు, రోళ్లపాలెం, చిందాడగరువు, జనుపల్లి, నల్లమిల్లి, రోళ్లపాలెం, వన్నెచింతలపూడి తదితర గ్రామాల్లోని పొంట పొలాలు ముంపునీరు నిలిచిపోయింది. తొలకరి తొలి దశలోనే భారీ వర్షంతో వరినాట్లు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామనగరువు, రోళ్లపాలెం తదితర ప్రాంతాల్లో రైతులు స్వచ్ఛందంగా ముంపు నీటిని పంట పొలాల్లోంచి మళ్లించుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేసుకుంటున్నారు.

- ముంపు నీటిని పంట పొలాల్లోంచి మళ్లించుకునేందుకు రైతుల ఏర్పాట్లు

ఉప్పలగుప్తం,(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాలకు 468 ఎకరాల్లో సార్వా నాట్లు ముంపులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు తెలిపారు. గురువారం ఏరువాక శాస్త్రవేత్త ఎం.నందకిశోర్‌భీమనపల్లిలో నీటమునిగిన సార్వా పొలాలను పరిశీలించారు. రైతులు వెంటనే కుళ్ళు తెగులు నివారణకు లీటరు నీటికి 2ఎంఎల్ హెక్సాకొనజోల్ పిచికారీ చెయ్యాలని సూచించారు. ఆకుముడత నివారణకు 2ఎంఎల్ కార్టాస్ హైడ్రోక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. రైతులు రాయపురెడ్డి శ్రీనివాస్, యాళ్ళ దుర్గారావు, యాళ్ళ అబ్బులు, చీకట్ల నాగేశ్వరరావు, అరిగెల వీరబ్రహ్మాజీరావు, యాళ్ళ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాల్లో కూడా వర్షం నీరు ప్రవేశించింది. కాలనీలలోని అంతర్గత రోడ్లు నీట మునిగాయి. నాట్లు వేసిన వరి వర్షం నీటిలో మునిగాయి. గురువారం ఉదయానికి మండలంలో వర్షపాతం 144.4 మిల్లీమీటర్లు నమోదైంది. అయితే గురువారం వర్షం కురవకపోవడంతో ముంపు క్రమేపీ తొలగుతుంది. ప్రభుత్వ కార్యాలయాలు, లోతట్టు కాలనీల్లో ముంపునీరు బటయకు మళ్లించే చర్యలను అధికారులు చేపట్టారు. నివాస గృహాల్లో నీటిని ప్రజలు బయటకు తోడుకుంటున్నారు. భారీ వర్షంతో మురుగునీటి కాల్వలు, పంటకాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి.



అయినవిల్లి మండలం నల్లచెరువులో ముంపునకు గురైన వరిచేలు

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): బుధవారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. నగరం గ్రామంలోని గుర్రాలచెరువు ప్రాంతంలోని పంట పొలాల్లో మోకాళ్లోతు నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 60ఎకరాల్లో పంట పూర్తిగా మునిగిపోయిందని, నాట్లు వేసి వారం రోజులు అయిందని రైతులు పేర్కొంటున్నారు. బుధవారం నుంచి పంట వరద ముంపులోనే ఉందని, ముంపునీరు దిగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే నాట్లు కుళ్లిపోయి అపార నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా మామిడికుదురులోని పలు ప్రాంతాల్లో వరి చేలు వర్షం నీటిలో నానుతున్నాయి.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి పంటచేలు చెరువులను తలపిస్తున్నాయి. బుధవారం వర్షం దంచి కొట్టింది. తీవ్ర వేడితో అల్లాడిన జనానికి వర్షం ఉపశమనం కలిగించింది. భారీ వర్షానికి రహదారులు, పంట పొలాలు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ



ఎద్దుల బండిపై ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్

ఐ.పోలవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తీసుకున్న రైతులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. పాతయింజరంలో దివంగత లోక్‌సభ స్పీకర్ బాలయోగి విగ్రహం నుంచి కొమరగిరి, మురమళ్ళ, మంగాపాలెం మీదుగా ఐ.పోలవరం వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురమళ్ళ ఇరిగేషన్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు అన్నదాతలకు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా తొలి విడతగా సీఎం చంద్రబాబు రూ.5000, పీఎం మోదీ రూ.2000 రైతుల ఖాతాల్లో జమచేశారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కాలా సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృధ్వీ, కాకర్లపూడి రాజేష్, చెల్లి అశోక్, పొద్దోకు బాలు, సాగి వాసురాజు, ఎంఎస్ఎన్ రాజు, నీటిసంఘం అధ్యక్షుడు రాయపురెడ్డి స్వామినాయుడు, మద్దిరెడ్డి కుమార్, ఆకుల సత్తిబాబు, ఆచంట సుభాష్, పెన్మెత్స శేఖర్, పి.కిశోర్‌రాజు, దంగుడుబియ్యం మోహన్‌తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మహానుభావుల త్యాగఫలంతోనే స్వాతంత్ర్యం: ఎమ్మెల్యే



పి.గన్నవరంలో 500 అడుగుల జాతీయపతాకాన్ని ఊరేగిస్తున్న విద్యార్థులు

పి.గన్నవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎందరో మహానుభావులు త్యాగఫలంతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం సెంటర్‌లో సాయితేజ విద్యా సంస్థల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహానుభావులను మనం స్మరించుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సాయి తేజ స్కూలు నుంచి త్రిరోడ్ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్ర మంలో సంసాని పెద్దిరాజు, సాధనాల శ్రీవెం కటసత్యనారాయణ, ఆదిమూలం సూరయ్య కాపు, తోలేటి చిన్నకాపు, యడ్ల ఏసు, అన్నాబ త్తుల హనుమాన్, తాటికాయల శ్రీనివాసరావు, నల్లా పెద్దకాపు, ప్రసన్నకుమార్, సుంకర వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొన్నమండ చైర్‌పర్సన్ అడబాల ప్రమాణ స్వీకారం

రాజోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పొన్నమండ వ్యవసాయశాఖ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్‌గా మెరకపాలేనికి చెందిన అడబాల రామకృష్ణతోగురువారం సొసైటీ సీఈవో డీఎస్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా ముగ్గ పెద్దిరాజు, దాకే ఏడుకొండలు ప్రమాణ స్వీకారం చేశారు. రాజోలులో ప్రాథమిక సహకార సంఘ చైర్‌పర్సన్‌గా కసుకుర్తి త్రినాథస్వామి, సభ్యులుగా శంకరపు ఆదినారాయణ, రేకపల్లి శ్రీనివాస్‌లతో సొసైటీ సీఈవో భాస్కరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులను డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, వైస్ ఎంపీపీలు యింటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యామ్‌బాబు, సూరిశెట్టి శ్రీనివాస్, కడలి వెంకటరమణారావు, కాట్న రాజు, దారపురెడ్డి బాబ్జి, అడబాల విజయ్, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, కుక్కల బేబికుమారి, కోఆప్షన్ సభ్యులు షేక్ ఇస్మాయిల్, కూటమి నాయకులు దుశ్శాలువాకప్పి పూలమాలలతో సన్మానించారు.

వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ఐ.పోలవరం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి):మురమళ్ళ వీరేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ.4కోట్ల సీజీఎఫ్ నిధులు మంజూరైన నేపథ్యంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు గురువారం ఆలయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఆలయంలోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షాలకు ముంపునకు గురవుతోంది. నూతనఆలయ నిర్మాణ ప్లాన్‌ను ఆయన పరిశీలించారు. దేవదాయశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, దేవదాయశాఖ డిప్యూటీ ఇంజనీర్ ఉదయకుమార్, ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

వీరులకు నివాళులర్పిస్తూ మౌనర్యాలీ



స్వాతంత్రోద్యమ వీరులను స్మరించుకుంటూ కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అమలాపురం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమంలో లక్షలాది మంది ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ భారతీయ జనతా పార్టీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మౌన ర్యాలీ నిర్వహించారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో గురువారం దేశ విభజన భయానక రోజు 1947ఆగస్టు 14లో జరిగిన సంఘటనలకు సంబంధించిన చిత్రాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. హర్‌ఘర్ తిరంగా జోనల్ ఇన్‌చార్జి నల్లా పవన్ కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మానేపల్లి అయ్యాజీవేమా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వాతంత్రోద్యమ వీరుల ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ కాగడాలతో పురవీధుల్లో మౌన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి బండి శ్రీనివాస్, జిల్లా పూర్వ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, పట్టణశాఖ అధ్యక్షుడు అయ్యల బాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకురుమెల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, కొపనాతి దత్తాత్రేయ, విళ్ల సత్యనారాయణ, మోకా వెంకటసుబ్బారావు, కుడుపూడి సత్యవేణి, చిట్టూరి రాజేశ్వరి, కొండేటి జయలక్ష్మి, బొంతు శివాజీ, పేరాబత్తుల సుబ్బారావు పాల్గొన్నారు.

మా సమస్య ఏశాఖదో చెప్పండి సారూ?



పోతవరంలో ఇళ్ల చుట్టూ నీరు చేరిన దృశ్యం

- ముంపు నీరు దిగక చేలు గోదారిని తలపిస్తున్నాయి అంటున్న రైతులు

పి.గన్నవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముందు మా సమస్య ఏశాఖకు చెందినదో కాస్త చెప్పండి సారూ... ఎవరి దగ్గరకు వెళ్లినా ఈపంటబోదే మాశాఖకు సంబంధించినది కాదని చెప్తున్నారు. మాగోడు ఎవరికి చెప్పుకోవాలి అంటూ ముంగండ, పోతవరం పరిసర ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి పోతవరం ముగ్గుబట్టి, ముంగండ పరిసర ప్రాంతాల్లో వరి చేలు వర్షం నీటితో నిండిపోయాయి. దీంతో రైతులు గురువారం తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. ముంపు నీటి సమస్యతో సుదీర్ఘకాలం నుంచి బాధపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడిప్పుడే నాట్లు పూర్తిచేసుకున్నామని నీరు ఎక్కువ కాలం నిల్వ ఉంటే వరి చేలు పూర్తిగా నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు సైకిల్ పోటీలు

అమలాపురంరూరల్,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రోళ్లపాలెం గున్నాపంతుల అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బొంతు వరప్రసాదరావు ఆధ్వర్యంలో సైకిల్ పోటీలు నిర్వహించారు. గురువారం ఈపోటీలను సర్పంచ్ మట్ట వైదేహీ-సాయిరామారావు ప్రారంభించారు. శుక్రవారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని ఉపాధ్యాయుడ అప్పారావు తెలిపారు


యానాం చేరుకున్న మంత్రి లక్ష్మీనారాయణ



మంత్రికి స్వాగతం పలుకుతున్న పరిపాలనాధికారి మునిస్వామి

యానాం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యానాంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు ప్రజాపనులశాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ గురువారం రాత్రి యానాం చేరుకున్నారు. ఉదయం విశాఖ విమానాశ్రయంలో పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. అనంతరం రోడ్డు మార్గంలో మంత్రి యానాం వచ్చారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, వివిధశాఖల అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఎంఈవో-1గా కృష్ణమోహన్



కాట్రేనికోన, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఎంఈవో-1గా నామాల కృష్ణమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.. పిఠాపురం హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఇక్కడ ఎంఈవో-1(ఎఫ్ఏసీ)గా కొనసాగుతారని ఒక ప్రకటనలో తెలిపారు.

స్కౌట్ అండ్ గైడ్స్ ప్రారంభం

మలికిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్‌ను గురువారం మలికిపురం ఎంఈవో ఎం.విజయశ్రీ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు మార్క్‌డ్రిల్ నిర్వహించి జైభారత్.. జైజైభారత్ అంటూ నినాదాలు చేశారు. కరస్పాండెంట్ ప్రసాద్, రమేష్‌బాబు, శేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బెలూన్లతో భారతదేశం



బెలూన్లతో భారతదేశ చిత్రపటాన్ని తయారుచేసిన లూటుకుర్రు విద్యార్థులు


మామిడికుదురు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రంగుల బెలూన్లతో తయారుచేసి ఇండియా చిత్రం ఆకట్టుకుంది. జాతీయ పతాకంలోని రంగులతో తయారుచేసిన ఈ బెలూన్ భారతదేశం చిత్రాన్ని ఈదరాడ హైస్కూలు విద్యార్థులు గురువారం తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబా, డ్రాయింగ్ టీచరు బత్తుల శ్రీనివాస్ అభినందించారు.

బొట్టు బిళ్లలతో గాంధీజీ



మలికిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): లక్కవరం సెవెన్త్‌డే స్కూలుకు చెందిన బి.స్టాలిన్ బొట్టుబిళ్లలతో గాంధీజీ చిత్రాన్ని తయారుచేశాడు. ముందుగా ఒక పేపరుపై గాంధీజీ స్కెచ్‌వేసి దానిపై మహిళలు నుదుటిపై ధరించే బొట్టుబిళ్లలను వరుస క్రమంగా అతికిస్తూ బాబూజీ చిత్రాన్ని చిత్రించాడు. చిత్రం ఆకర్షణీయంగా ఉండడంతో పలువురు స్టాలిన్‌ను అభినందించారు. ఈ విధంగా జాతీయ నాయకుల బొమ్మలను రూపొందించి నాల్గో ఏడాదిలో గోల్డ్, సిల్వర్ పతకాలను, ఐదో ఏట గోల్డ్, సిల్వర్ మెడల్స్ ఆరు, ఏడు సంవత్సరాల్లో కూడా మెడల్స్‌ను అందుకున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా స్టాలిన్‌ను పలువురు అభినందించారు.

ఆక్వా రంగం బాగుపడాలంటే సిండికేట్ పోవాలి: నాగభూషణం




కాట్రేనికోన, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సంక్షోభంలోకి వెళ్లిపోతున్న ఆక్వా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోకపోతే ఆక్వా రైతులు పూర్తిగా నష్టాల ఊబిలోకి కూరుకుపోయి, రాబోయే రోజుల్లో ఆక్వా పరిశ్రమే కనుమరుగయ్యే పరిస్థితి ఎదుర్కొవలసి వస్తుందని ఆక్వా ఫెడరేషన్ సలహాదారు త్సవటపల్లి నాగభూషణం ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 12వేల కనెక్షన్లు సబ్సిడీలు కోల్పోతున్నాయన్నారు. 4.50లక్షల ఎకరాల్లో ఉన్న ఆక్వా సాగు 10లక్షల ఎకరాలకు విస్తరిస్తామని విజయవాడ సదస్సులో సీఎం చంద్రబాబు అన్నారని, అయితే ఈవిస్తీర్ణం గతం కన్నా దిగజారిపోయేలా ఉందన్నారు. ట్రంప్ సుంకాలు అమలులోకి రాకుండానే ఎక్స్‌పోర్టర్లు టన్నుకు రూ.30వేలనుంచి 40వేల వరకు తగ్గించి, వందల కోట్లు దండుకున్నారన్నారు. ఇప్పటికే 50శాతం ఎకరాల్లో రైతులు సాగుకు దూరంగా ఉంటూ, చెరువులను ఖాళీగా ఉంచారన్నారు. ఆక్వా ఎగుమతుల్లో దేశంలోనే 70శాతం ఉత్పత్తులతో ఏపీ అగ్రస్థానంలో ఉంటే, ఉభయగోదావరి జిల్లాల రైతుల ద్వారానే ఎగుమతులు జరుగుతున్నాయన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత చేసుకోండి

మలికిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు విజనరీ నాయకుడని, ఆయన ఆలోచనలకు అనుగుణంగా మనమంతా ముందుకెళ్లాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద క్లబ్ మహీంద్ర ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దిండి గ్రామంలో దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలు పది మందికి వారు సమకూర్చిన బియ్యం బస్తాను అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, పీ-4 ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, క్లబ్ మహీంద్ర ఆర్గనైజర్స్ జి.తులసీరామ్, సాయిస్వరూప్, సర్పంచ్ ఎం.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐ త్రినాథరావుకు ఉత్తమ సేవా పురస్కారం



అమలాపురం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలో ఆర్ఎస్ఐగా పనిచేస్తోన్న బొక్కా త్రినాథరావుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఉత్తమ సేవా పతకం లభించింది. స్థానిక జడ్పీ పాఠశాలలో చదువుకున్న త్రినాథరావు బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగం దక్కించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు జాతీయ స్థాయిలో జరిగిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్లలో పోలీసుశాఖ తరఫున పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. హైదరాబాద్ వీఐపీ సెక్యూరిటీ విభాగంలోను పనిచేశారు. పదోన్నతిపై అమలాపురంలో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న త్రినాథరావు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనకు ఉత్తమ సేవా పతకాన్ని ప్రకటించింది.

విభజన విభాషిత స్మృతి దివస్

అమలాపురం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం విభజన విభాషిత స్మృతిదివస్ కార్యక్రమం జిల్లాశాఖ అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత అమలాపురం రాయల్ జూనియర్ కళాశాల వద్ద నుంచి ఎర్రవంతెన వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్వామివివేకానంద విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా శాఖ మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు మాట్లాడుతూ దేశ విభజన సమయంలో హిందువులపై జరిగిన అకృత్యాలు, నరమేధాన్ని విద్యార్థులు, యువతకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మోకా వెంకటసుబ్బారావు, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు జగతా శాంతి, మహిళామోర్చా నాయకురాలు దొంగ గంగాభవానీ, గానాల సాయి, హెచ్ఎం జగదీష్, కుమార్ పాల్గొన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

కాట్రేనికోన, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఉప్పూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షునిగా వంగా మల్లిఖార్జునరావు, సభ్యులుగా ముమ్మిడివరపు నాగేశ్వరరావు, గాలిదేవర గణేష్ ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హాజరై, చైర్మన్ మల్లిఖార్జునరావును సత్కరించారు. సర్పంచ్ రంబాల రమేష్, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, టీడీపీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, జనసేన అధ్యక్షుడు మోకా బాలప్రసాద్, చెయ్యేరు, కుండలేశ్వరం, పల్లంకుర్రు, కందికుప్ప, గెద్దనపల్లి, కాట్రేనికోన సొసైటీ అధ్యక్షులు రాజారావు, ఇసుకపట్ల రాంబాబు, నాయకులు త్సవటపల్లి నాగు, మంతెన శ్రీనురాజు, దండుప్రోలు సత్యం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అంబాజీపేట సొసైటీ సభ్యుల బాధ్యతల స్వీకరణ



సొసైటీ చైర్మన్ సూరిబాబును సత్కరించిన దృశ్యం

అంబాజీపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట సహకార సొసైటీలో గురువారం చైర్మన్‌గా అరిగెల సూర్యనారాయణమూర్తి(సూరిబాబు), సభ్యులుగా ఉందుర్తి సత్యనారాయణ, పితాని వేమవెంకట సత్యప్రసాద్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా త్రిసభ్య కమిటీ సభ్యులను కూటమి నేతలు సత్కరించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాయకులు కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, చిన్నం విజయరావు, నాగాబత్తుల సుబ్బారావు, సొసైటీ సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లి సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం

మామిడికుదురు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి సొసైటీ చైర్మన్‌గా కామిశెట్టి వెంకట్రావు (బాబ్జి) సభ్యులుగా పాటి గోవిందరావు, తులా ఆదినారాయణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రైతులకు సొసైటీ ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తామని తెలిపారు. నూతన కమిటీని మాజీ సర్పంచ్ బొంతు సూర్యభాస్కరరావు, తులా శ్రీనివాస్, గుబ్బల సత్యసింహాద్రి, పరమట శ్రీధర్, కోలా రాంబాబు, సాకా ఏడుకొండలు, పాటి వెంకట్రావు, ఆచంట సతీష్, సొసైటీ సెక్రటరీ గిడుగు శ్రీరాములు తదితరులు అభినందించారు.

బాధ్యతలు చేపట్టిన పాలకవర్గాలు

మలికిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మోరివ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా బళ్ల రామారావు, డైరెక్టర్లగా కడలి రాంబాబు, మండా రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. చింతలమోరిలో చైర్మన్‌గా దొడ్డా సూర్యనాగప్రసాద్, సభ్యులుగా గాడి సీతారామరాజు, రాపాక చంద్రశేఖర్, తూర్పుపాలెంలో చైర్‌పర్సన్‌గా యెనుముల సూర్యనారాయణమూర్తి, సభ్యులుగా పితాని నాగరాజు, ఓదూరి ప్రసాద్‌లు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, సొసైటీమాజీ అధ్యక్షుడు పిండి వెంకటమోహనరావు, ముప్పర్తి విక్రమార్కరావు, నీటిసంఘం అధ్యక్షుడు యెనుముల సింహాచలం, మండల జనసేన అధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, యెనుముల వెంకటపతిరాజా పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

పి.గన్నవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముంగండ గ్రామదేవత శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో 15అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు గురువారం స్థానికులు భూమిపూజ చేశారు. పండితులు పుల్లేటికుర్తి సత్యనారాయణమూర్తి బ్రహ్మత్వంలో నన్నయ విశ్వవిద్యాలయం న్యాయాధికారి నందెపు నాగేంద్రరావు, మహిత దంపతులు, మాజీ ఎంపీపీ అంబటి కోటేశ్వరరావు, భూలక్ష్మి దంపతులు భూమిపూజ చేశారు. అంజనేయస్వామి విగ్రహాన్ని తాను ఏర్పాటు చేస్తున్నట్లు నాగేంద్రరావు తెలిపారు.

'పులివెందులలో వెల్లువిరిసిన ప్రజాస్వామ్యం'

మలికిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందులలో ప్రజాస్వామ్యం వెల్లువిరిసిందని టీడీపీ నాయకులు అన్నారు. మలికిపురంలో జరిగిన సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా కడపలో ఎన్నికలే జరగలేదని, రిగ్గింగ్ చేసేవారని అన్నారు. కూటమి ఆధ్వర్యంలో ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేశారని, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయన్నారు. జగన్‌కు, వైసీపీ నాయకులకు ఇది చెంపపెట్టు అన్నారు. భవిష్యత్తులో జగన్‌కు ఇదే తీర్పు పునరావృతం అవుతుందని హెచ్చరించారు. సమావేశంలో రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, రాపాక నవరత్నం తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ స్కూల్ వాలీబాల్ ఎంపికలకు గొల్లవిల్లి విద్యార్థులు

ఉప్పలగుప్తం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అండర్-15 బాలురు, బాలికల ప్రపంచ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈఏడాది డిసెంబరులో చైనాలోని శాంగ్లోలో జరగనున్నాయి. ఈపోటీల్లో ఆడేందుకు మూడు దశల్లో క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్టు పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ తెలిపారు. ఈపోటీలకు గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు దేవరపల్లి శ్రీరామ్, తొత్తరమూడి అభిరామ్, గాలిదేవర యశస్విని, సుంకర వర్షిణి, పండు దివ్యలేఖన ఎంపికయ్యారు. కాకినాడలో ఎంపికైన వీరు ఈనెల18న విజయవాడలో జరిగే ఎంపికలకు హాజరుకానున్నారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ ఎంపికలకు వెళ్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో వి.విజయభాస్కర్, డి.వాణి, యాళ్ళ సత్యశ్రీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్శిటీలో సీటు సాధించిన మౌర్య



పి.గన్నవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆర్.ఏనుగుపల్లికి చెందిన చప్పిడి మౌర్యసంజీవ్‌వర్ధన్ ప్రతిభ కనబరిచి విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీటీయూ) లో సీటు సాధించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన సెంట్రల్ యూనివర్శిటీ కామన్‌టెస్ట్‌లో అత్యధిక మార్కులు సాధించి బీఎస్సీ అర్టిఫిషియల్ ఇంటిలి జెన్స్‌లో సీటు సాధించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు శ్రీరామ్‌శెట్టి, కిరణ్మయి తెలిపారు.

తిరంగా ర్యాలీ

మలికిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మలికిపురం సెంటర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు మేడిచర్ల చాణిక్య ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో గాంధీబొమ్మల కూడలి నుంచి పద్మజ థియేటర్ వరకు విద్యార్థినీవిద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లాఅధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లాఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనాగేష్ మాట్లాడుతూ ప్రతీ ఇంటిపై, కార్యాలయాలపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. అడబాల రాంబాబు, చెంపాటి శివరామకృష్ణంరాజు, కె.కనకేశ్వరరావు, పోలిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

మలికిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మలికిపురం దీక్షా పాఠశాలలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమం వినోదంగా జరిగింది. కోలాటం, భజనలతో కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

అంబాజీపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు గుంటమామిడితోట పాఠశాలలోని విద్యార్థులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావు రూ.20వేలు విలువైన నోటు పుస్తకాలు, అట్టలు, పెన్నులు, వివిధ రకాల సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ సుదర్శన్, ఉపాధ్యాయులు బీవీ నాయక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

'ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం'

మంత్రి సుభాష్



రైతుల ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని మంత్రి సుభాష్ అన్నారు. గురువారం అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధిపొందిన రైతులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత తెలుపుతూ రామచంద్రపురం మండలం హసన్‌బాద నుంచి ద్రాక్షారామ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ట్రాక్టర్ నడుపుతూ రైతులతో మమేకమయ్యారు. ద్రాక్షారామ వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన రైతుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అన్నదాతల కోసం ఎన్నో పథకాలు అమలు చేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల ఖాతాల్లో రూ. 3,174 కోట్ల నిధులు జమ చేశామన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో అన్నదాతల కష్టాలు తొలగిపోయాయన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, పట్టణ అధ్యక్షుడు వుండపల్లి శివ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పింపళ్ల వీరభద్రరావు, నర్సింగ్ కొత్తపల్లి అరుణ, మాజీ ఏఎంసీ చైర్మన్ గుడిసపాటి సూర్యనారాయణ మూర్తి, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, అధిక సంఖ్యలో రైతులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆదాయం రూ.3.66 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,66,066 వచ్చినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు

ఆలమూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్‌లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. హైస్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు వీటిని ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రుక్మిణీ, సత్యభామ వేషధారణల్లో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కృష్ణుడి వేషధారణ పోటీలు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ర్యాలీ మ్యాజిక్ హౌస్ వద్ద కృష్ణాష్టమి సందర్భంగా పదేళ్లలోపు చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషధారణ పోటీలు శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధి అన్నపూర్ణ తెలిపారు. మరిన్ని వివరాలకు సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భాష్యం స్కూల్‌లో..

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం భాష్యం స్కూల్‌లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రైమరీ విద్యార్థులతో శ్రీకృష్ణుడు, సత్యభామ, గోపికల వేషధారణలతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఉట్టికొట్టి కృష్ణాష్టమి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

మోడరన్‌లో..

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మోడరన్ ప్రైమరీ విద్యాసంస్థల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు చిన్నికృష్ణులు, గోపికలుగా అలంకరించుకుని సందడి చేశారు. కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, మోడరన్ అకడమిక్ డైరెక్టరు రమాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



రాయవరం భాష్యం స్కూల్‌లో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రామకృష్ణను పరామర్శించిన డీఎస్పీ

రావులపాలెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో జరిగిన రైతు సంబర కార్యక్రమంలో ఎద్దు బెదిరిన సందర్భంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణకు గాయాలయ్యాయి. గోపాలపురంలో ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న రామకృష్ణను గురువారం డీఎస్పీ సుంకర మురళీమోహన్ పరామర్శించారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు రామకృష్ణను పరామర్శించారు.



రామకృష్ణను పరామర్శిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

పులివెందుల, ఒంటిమిట్టలో గెలిచిన ప్రజాస్వామ్యం

కొత్తపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందులలో టీడీపీ విజయంతో ప్రజాస్వామ్యం గెలిచిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం వాడపాలెం కార్యాలయంలో విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేకేకట్ చేశారు. సుమారు ముప్పై ఏళ్ల తరువాత ప్రజాస్వామ్య బద్ధంగా పులివెందులలో ఎన్నికలు జరిగాయన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడంతో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిందన్నారు. అక్కడి ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుతున్న ఎమ్మెల్యే బండారు

పాఠశాలను తనిఖీ చేసిన తహశీల్దారు, ఎంఈవో

రాయవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాయవరం మెయిన్ ప్రాథమిక పాఠశాలను గురువారం తహశీల్దారు పీవీ శెట్టి, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం, న్యాణ్యతను వారు తనిఖీ చేశారు. పాఠశాల రికార్డుల తనిఖీతో పాటు పరిసరాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం లచ్చిరెడ్డి వెంకటరమణ, ఉపాధ్యాయులు కె.నాగిరెడ్డి, బాస్కరరావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

రాయవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): లొల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్ ప్రారంభించారు. గ్రామంలో లో ఓల్టేజ్ సమస్యను లేకుండా ఉండేందుకు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు విద్యుత్‌శాఖ రాయవరం ఏఈ సుంకర శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సుంకవల్లి గంగరాజు, ఎస్.శ్రీనివాసులు, లైన్ ఇన్స్పెక్టర్ తడాల రామకృష్ణ, లైన్‌మన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుబాకలో పొలంబడి

మండపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మారేడుబాకలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ప్రఖార్ ఆధ్వర్యంలో జరిగిన పొలంబడి కార్యక్రమానికి పలువురు రైతులు హాజరయ్యారు. సుఖీభవ పథకం కోసం దరఖాస్తు చేసుకోని వారు ఈనెల 20న కల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో రాయుడు గంగరాజు, ముత్యాల సత్యనారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం అముజూరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ జరుపుతున్న నాయకులు, విద్యార్థులు



రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ జెండాలతో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



కపిలేశ్వరపురం మండలం వల్లూరులో జాతీయ జెండాలతో ర్యాలీ జరుపుతున్న విద్యార్థులు

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

కె.గంగవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అముజూరు గ్రామంలో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ జరిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు ఆధ్వర్యంలో హరిశిక పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ చేశారు. శుక్రవారం నాడు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అవసరాల రమణమూర్తి, గుర్రాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో...

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగ ర్యాలీ జరిపారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. అనంతరం జాతీయ జెండాలతో మానవహారం, ప్రదర్శన నిర్వహించారు.

దేశ చిత్రపటం ఆకారంలో..

రాయవరం, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని రాయవరం భాష్యం స్కూల్ విద్యార్థులు గురువారం పాఠశాల ప్రాంగణంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు భారతదేశ చిత్రపటం ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ద్వారంపూడి చిన్నబాబు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



దేశ చిత్రపటం ఆకారంలో రాయవరం భాష్యం విద్యార్థుల ప్రదర్శన

కోడిగుడ్డు గుల్లలో జాతీయ జెండా

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు శ్రీను కోడిగుడ్డు గుల్లపై జాతీయ పతాకం రూపొందించారు. కోడిగుడ్డు గుల్లకు రంధ్రాలు చేసి పైభాగంలో కాషాయం, క్రింది భాగంలో పచ్చరంగులు, మధ్య భాగంలో ధర్మచక్రం నీలం దారంతో ఏర్పాటు చేశారు.

జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం జాతీయ జెండాలతో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చిట్టూరి శ్రీధర్, ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటుకున్న కళాశాల విద్యార్థులు

అంగర శ్రీ సిద్దార్థ కళాశాల విద్యార్థులు 79 అంకె ఆకారంలో నిలుచుని దేశభక్తిని చాటారు. గురువారం కళాశాల మైదానంలో విద్యార్థులు మువ్వన్నెల జెండాను చేతబట్టి దేశభక్తిని కొనియాడారు. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, చైర్మన్ వి.వివేశ్వర్, కరస్పాండెంట్ వాకా రాజా మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌పై దేశ చిత్రపటం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అవిడి శివారు వన్నీపల్లి వారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న టి.గౌతమ్ చాక్‌పీస్‌పై భారతదేశ చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. మరో విద్యార్థిని కె.రత్నశ్రీ పోస్టుకార్డుపై 36సార్లు వందేమాతరం గీతం రాయగా, వీరిని హెచ్ఎం కె.అరుణశ్రీ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



కపిలేశ్వరపురం మండలం అంగరలో 79వ ఆకారంలో కళాశాల విద్యార్థుల ప్రదర్శన

నేడు భీమేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్రాక్షారామ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవాని తెలిపారు. రెండు బృందాలుగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 6.30 గంటలకు మొదటి బృందం, 8.30 గంటలకు రెండవ బృందంతో వ్రతాలు నిర్వహిస్తామన్నారు. సుమారు 5 వేల మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొంటారని తెలిపారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే మహిళలకు చీర, రవిక, వరలక్ష్మీ రూపు, ఇతర పూజా సామగ్రి అందజేస్తామన్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మంత్రి సుభాష్ దంపతులు పాల్గొంటారని తెలిపారు.

సీఎంను కలిసిన మోడరన్ అధినేత జీవీ రావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు బుధవారం సీఎం చంద్రబాబునాయుడును తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఎన్టీఆర్ ట్రస్టు సిఫార్సు చేసే పది మంది అనాథ విద్యార్థులకు వసతితో కూడిన ఉచిత విద్యను అందిస్తామని మోడరన్ అకడమిక్ డైరెక్టర్ రమాదేవి సంసిద్ధత వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు అంగీకార పత్రం అందచేశారు. ముఖ్యమంత్రికి వెంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేశారు.

పులివెందుల తీర్పు జగన్‌కు చెంపపెట్టు

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల తీర్పు వైసీపీ జగన్‌కు చెంపపెట్టు అని మంత్రి సుభాష్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో వైనాట్ కుప్పం అన్నారని నేడు వైనాట్ పులివెందుల అయ్యిందన్నారు. పులివెందుల ఎన్నికల్లో వైసీపీ ఓటమి జగన్‌కు, ఆ పార్టీ నాయకులకు పెద్ద గుణపాఠం అన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కించుకోలేని ప్రజల్లో వైసీపీ జగన్‌పై ఎంత వ్యతిరేకత ఉందో అర్థం ఈ పలితాలే నిదర్శనమన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని ఉడదీస్తానని అన్న జగన్‌కు పులివెందుల ప్రజలు నేడు బట్టలు ఊడదీశారని విమర్శించారు. ఇప్పటికైనా వైసీపీ జగన్ తన తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని స్థానాల్లో డిపాజిట్లు కూడా కోల్పోవడం ఖాయమన్నారు.

టీడీపీ విజయంపై హర్షం

మండపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందులలో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం పట్ల మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టిన ఓటర్లను అభినందించారు.

భారీ వర్షానికి నీట మునిగిన వరిచేలు

రావులపాలెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు మురుగు డ్రైయిన్లు పొంగి ప్రవహిస్తూ పంట పొలాలను ముంచెత్తున్నాయి. మండలంలో బుధవారం సాయంత్రం నుంచి పడుతున్న వర్షానికి ఆయా పొలాల్లో ముంపునీరు చేరింది. దీంతో శివారు ప్రాంత పంట పొలాలు చెరువులను తలపిస్తూ ముంపులో చిక్కుకున్నాయి. మురుగుడ్రైన్లు ఆధునికీకరణ జరగకపోవడంతో వరి పొలాల్లోని ముంపునీరు పారేందుకు నాలుగైదు రోజులు పట్టవచ్చునని రైతులు వాపోతున్నారు. ముంపులో ఎక్కువ రోజులు ఉంటే కుళ్లిపోయే ప్రమాదం ఉందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

కొత్తపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను సంఘ సంస్కర్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలూరి జయప్రకాశ్‌నారాయణ, మద్దింశెట్టి శ్రీనివాసరావు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, వలపర్తి కిరణ్, అన్నం సత్యనారాయణ, పెన్నాడ నారాయణరావు, ఉద్దరాజు ప్రసాదరాజు, బొర్రా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఏడిద గ్రామానికి చెందిన 21 మందికి మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. రామచంద్రపురం ఆర్డీవో అఖిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడారు. అనంతరం ఆర్డీవో అఖిల మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాశ్, ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ వసుమర్తి నాగేశ్వరరావు, జనసేన నాయకుడు రామిశెట్టి రాజా, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పి.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

మండపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నివర్గాల సంక్షేమానికి ఉపాధి రుణపడి ఉంటామని పలువురు చేనేత కార్మికులు చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. మండపేటలో చేనేతసంఘాలు, కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే సమక్షంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాశ్, చేనేత సంఘ నాయకులు కాదా ఏడుకొండలు, పెంకెటి లాలయ్య, మున్సిపల్ కౌన్సిలర్ కాశీన కాశి విశ్వనాధం, వివిధ చేనేత సంఘాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మండపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జెడ్.మేడపాడులో శిథిలావస్థకు చేరిన కేశవస్వామి ఆలయ పునర్నిర్మాణ భూమిపూజలు గురువారం వైభవంగా జరిగింది. స్వామివారి ఆలయ నిర్మాణ పనులకు పలువురు ప్రముఖ హాజరై శంకుస్థాపనలో పాల్గొన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖకు చెందిన దేవాలయ నిర్మాణం కోసం పలువురు దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి ముందడుగు వేశారు. సుమారు రూ.60 లక్షలతో నిర్మించే ఆలయ భూమిపూజలో టీడీపీ యువనేత వేగుళ్ల అజయ్‌బాబు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీపీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వినయ్ సారధ్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేదంబరీలర్, ఎంపీడీవీ సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యవసాయ పద్ధతుల కోసమే పొలంబడి కార్యక్రమం

కె.గంగవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఉత్తమ వ్యవసాయ పద్ధతులను రైతులకు అలవర్చేందుకే పొలంబడి నిర్వహిస్తున్నామని వ్యవసాయశాఖ మండల అధికారి అనసూరి సత్యకుమూర్తి అన్నారు. గురువారం కుందూరు గ్రామంలో పొలంబడి నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ, కూటమి నాయకులు బాబీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసిన మున్సిపల్ సిబ్బంది

మండపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న పలు దుకాణాలపై గురువారం మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరి ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయ ఉద్యోగులు పట్టణంలో ఆయా దుకాణాలపై దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లను పట్టుకున్నారు. ఆరు దుకాణాల్లో నిషేధించబడిన ప్లాస్టిక్ కవర్లు, 300 ప్లాస్టిక్ గ్లాసులు సీజ్ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.